# ముగింపు

**చిలుకూరి దేవపుత్ర**

**ఆ రమణమ్మ భర్త పరుపుమీద నుంచి తెచ్చి బయటపడేశాడట. కాల్చుకుని చనిపోయిన వాళ్లని నేనూ రెండు మూడుసార్లు చూశాను శారదా! అయితే ఇది మాత్రం ఆత్మహత్య కాదమ్మా. ఇది ఖచ్చితంగా హత్యే!**

ఆరోగ్యంగా ఉన్న మనిషి గుండె నిమిషానికి డెబ్బైరెండు సార్లు కొట్టుకుంటుందట. అదే నిజమైతే నా గుండె నిమిషానికి మూడువందల డెబ్బైరెండు సార్లు కొట్టుకుంటోంది మరి! అలాగని నేనేం అనారోగ్యవంతురాల్ని కాను — నాలో 'భయ'మన్నది అంత ఉన్నదన్నమాట. చిన్నసైజు ఆయిల్ ఇంజన్‌ని ఎదలో ఉంచుకున్నట్టుంది. నాకంత 'భయం' కలగడానికి కారణం ఎవరికైనా చెబితే — గుర్రుపెట్టి నిద్రపోతున్న మనిషి కూడా ఉలిక్కిపడి లేచేంతగా ఫెళ్ళున నవ్వుతారు. అవును అంత చిన్నది మరి ఆ కారణం....

అదేమిటంటే...

ఆవేళ అన్నం బాగా చిమిడిపోయింది. అదేం ఖర్మమోగాని పప్పులో తిరగమోత కూడా బాగా మాడిపోయిందాయె. మావారు అసలే కోపిష్ఠి — అయితే, ఆయన చెడ్డవారని నేనను. కఠినుడని అసలే అనను. చంపదగిన యట్టి శత్రువు తన చేత చిక్కినా — చక్కగా నవ్వి, షడ్రసోపేతమైన భోజనం పెట్టి, కిళ్లీని, కింగ్‌సైజ్ సిగరెట్టుని అందించి మరీ పొమ్మనే రకం.

అయితే—

భోజనం విషయంలో మటుకూ చండశాసనుడే. రసంలో ఏమాత్రం ఉప్పు ఎక్కువైనా, పప్పులో ఒక్కరవ్వ తక్కువైనా, అన్నం ఏమాత్రం చిమిడినా ఆవేళ రామరావణ సంగ్రామమే ఇంట్లో. మేము అద్దె కొంపలో ఉన్నాం కాబట్టి సరిపోయింది కాని లేకుంటే ఇల్లు పీకి పందిరేసేవారే.

"అప్పుడే ఒకటిన్నర కావస్తోందోయ్ భోజనం వడ్డించు తొందరగా వెళ్ళాలి" అన్నారు మావారు — టకటక లోపలికి వచ్చేసి.

నా ఎదలో ఆయిలింజనుకి స్పీడు మరీ ఎక్కువయింది. ఈ పూట ఎలా గడుస్తుందిరా దేవుడా! 'ఆయన ఏమనకుండా భోజనం చేసి వెళితే నీకు మాటొక్క టెంకాయలు కొడతాను స్వామీ' అని మొక్కుకున్నా. అయినా దేవుడి మీద నాకు నమ్మకముందో లేదో కాని, నన్ను మాత్రం దేవుడు ఛస్తే నమ్మడు. నేనలా మొక్కుకోవడం ఏ లక్షోసారో. ఒక్క మొక్కయినా చెల్లించి ఉంటేగా ఆ దేవుడు రక్షించడానికి.

"ఏమిటి పరధ్యానంలో ఉన్నావు?" అన్నారు.

"ఏబ్బే ఏం లేదండీ!" అన్నాను భోజనం వడ్డిస్తూ.

జున్నులాంటి అన్నాన్ని పప్పుతో కలుపుకుంటూ మాడిపోయిన పోపు ముక్కల్ని అవలీలగా పక్కన పెట్టేస్తున్న మా వారిని చూస్తుంటే అసలు ఆ భోంజేస్తోంది మావారేనా లేక మారువేషంలో వచ్చిన మాయా జగన్నాథం (అది మా వారి నామధేయం లెండి) కాదుకదా! అని ఒకటే ఆశ్చర్యపోతున్నాను. కొంపదీసి మొక్కు చెల్లించుకోవాలని దేవుడుగారు వేసిన ఎత్తు కాదు కదా!

"ఏమిటి పరధ్యానంలో వున్నావు" అన్నారు మళ్లీ.

"అన్నం చిమిడిపోయింది... పప్పులో పోపు మాడిపోయింది. ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లి ముక్కలు గచ్చకాయలంతేసి రాక్షస బొగ్గుల్లా తేలి ఉన్నా ఒక్క మాటయినా అనకుండా భోంచేస్తున్నారంటే... మీదా నాదా పరధ్యానం" అనాలనిపించింది. ఇంత నెమ్మదిగా తింటున్నారంటే — తుఫాను ముందటి ప్రశాంతి కాదు కదా!

"పప్పు అన్నం ముద్దగా జోరుగా కలిపారు. నా మొహాన విసిరికొట్టరు కదా! అని వణికిపోయేను. గుండ్రాయంతటి ముద్దను విసరలేదు. పులిలా నోరు తెరచి గుటుక్కున మింగేశారు.

నేనలా చూస్తూ ఉండిపోయేను.

"ఈవాళ మా ఆఫీసులో ఇన్‌స్పెక్షన్. ఇప్పుడు నా వర్కును ఇన్‌స్పెక్ట్ చేస్తారు" అన్నారు ఉన్నట్టుండి మావారు.

"ఊహూ... అలాగా"

"పెధవలు తొందరగా ఆ పీడ విరగడవుతుందనుకుంటే ఒక్కో పర్సనల్ రిజిస్టర్ని గంటన్నర చూస్తున్నాడు కలెక్టర్."

ఆహా ఎవరా కలెక్టరు! ఎంత మంచివారో రోజూ వీళ్ల ఆఫీసుని ఇన్‌స్పెక్ట్ చేస్తే ఎంత బావుండేదో.

"అమ్మా సీతక్క ఆత్మహత్య చేసుకుంది!" అంటూ మా పెద్దమ్మాయి పరుగువచ్చి చెప్పింది.

"ఏ సీతక్కా?" అన్నాన్నేను.

"ఏ సీతక్కేంటమ్మా — ఎదురుగా ఉన్న కాంపౌండులో కుడివేపున ఉన్న ఇల్లు — కాల్చుకుని చనిపోయింది."

"ఆ... అలాగా!" అంటూనే వెంటనే లేచి "ఇప్పుడే వస్తానండి... ఆ గిన్నెలో పెరుగుంది వేసుకోండి!" అని చెప్పేసి ఉరుకుతున్నంత వేగంగా నడక సాగించాను.

సీతక్క ఇంటి చుట్టూ గుంపులు గుంపులుగా ఉన్నారు జనం. అందరూ ఆ చుట్టుపక్కం వాళ్లే. ఆత్రంగా గుమ్మంలోకి జనాన్ని తోసుకుని అడుగుపెడుతుంటే గుమ్మంలోనే ఉంది సీతక్క శవం. కాలటం అంటే అలా ఇలా కాదు. బాగా నల్లగా మాడిపోయి వుంది. కాళ్లూ చేతులూ అదే పనిగా పొయ్యిలో పెట్టి కాల్చినట్టున్నాయి. ఒంటి మీద గుడ్డలు ఏమాత్రమున్నాయో తెలీదు కాని, ఒక గజం ముక్క తెల్లటి గుడ్డని ఆచ్ఛాదన ఉండాల్సిన చోట్ల కప్పారు.

"సీతక్క మొగుడేడీ?" అంటూ గుంపులోంచి ఎవరో అడిగారు.

"ఆ మొగుడుగాడు యాడున్నాడో... అసలు ఇంట్లో ఒక్కరున్నా ఉంటేగా అసలు విషయం తెలిసేది" అన్నారు ఇంకెవరో.

"ఎక్కడికెళ్లారు?" అన్నాను ఆత్రంగా నేను.

"మ్యాట్నీ షోకని అర్థగంట కిందట వెళ్లారమ్మా అందరూ. ఈ పిల్లని పిల్చారుట రానందిట వాళ్లత్తయ్య నాతో చెప్పింది. ఇట్లా కాల్చుకుని చావాలని అనుకుందేమో!" అంది సీతక్క పక్కింటావిడ.

"ఇరవయ్యేళ్లన్నా లేవు అప్పుడే నిండు జీవితాన్ని నాశనం చేసుకుంది" అన్నాడో ముసలాయన.

అదంతా చూస్తుంటే నా కడుపులో దేవినట్టయి ఇంటిదారి పట్టాను.

"ఏమ్మా శారదా! సీతక్క చనిపోయిందటగా నువ్వెళ్ళేటప్పుడు నన్నూ లేపకూడదూ... పాడు నిద్ర ఇప్పుడే ముంచుకురావాలా!" అంటూ హడావిడిగా లేస్తూ అంది మా అత్తయ్య.

"ఇప్పుడేమయిందిలే అత్తయ్యా! వెళ్లి చూసిరా!" అంటూ ఇంట్లో కెళ్లాను.

మా అత్తయ్య వెళ్లిన తర్వాత గంటకి గాని తిరిగి రాలేదు.

వస్తూనే—

"ఆ పిల్ల ఆత్మహత్య చేసుకోలేదమ్మా, శారదా! హత్య చేశారు" అంది పడక కుర్చీలో కూర్చుంటూ.

"ఎవరు అత్తయ్యా?"

"ఇంకెవరూ ఆ పిల్ల అత్త, మామ, మొగుడూ"

"నిజమా అత్తయ్యా"

నిజానికి మా అత్తయ్య ఇలా నాకు అత్తయ్యగా



మావారికి తల్లిగా, నా పిల్లలకి నానమ్మగా ఉండాల్సింది కాదు. దేవుడు చల్లగా మామంటే ఏ ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్లోనే ఉండాల్సింది.

"అవును శారదా!" అంది అత్తయ్య తన అద్దాల్ని ముక్కుపైకి ఎగదోసుకుంటూ.

"ఎలాగత్తయ్యా. ఆదెలా — వాళ్లంతా మ్యాట్నీ కెళ్లారుగా"

"అంతే నీకు తెలిసింది... సీతక్క అత్తా, మామ, మొగుడూ మ్యాట్నీకి వెళ్లకముందే ఆ పిల్లని చంపేసి మంచంపై పెట్టి కిరోసిన్ పోసి అంటించేసి, చుట్టుపక్కల వాళ్లకి మ్యాట్నీకి రమ్మని పిల్చినా రాలేదు, ఇంట్లోనే ఉంటానంది మా కోడలు అని చెప్పి మరీ వెళ్లారు. అంటే ఏమిటి... తాము వెళ్లాక ఆత్మహత్య చేసుకుంది అని అందరూ అనుకోవాలని. తెలుసుకో వాళ్లెంత తెలివైన వాళ్లో. పోనీ ఈ పిల్లే ఆత్మహత్య చేసుకునేందుకు కిరోసిన్ పోసుకునే నిప్పంటించుకుందనుకో... ఒక్క కేక కూడా వినబడదా ఆ చుట్టుప్రక్కల ఇళ్ల వాళ్లకి. చెప్పు — ఇంట్లోంచి ఏదో బట్టలుకాలిన వాసన వచ్చి తలుపు తోసుకుని వెళ్లారట పక్కింటి రమణమ్మవాళ్లు, అయితే బట్టలు కాదు వాసన వేసింది. — బట్టలెప్పుడో కాలిపోయాయట. మరి ఆ వాసన వేసింది ఏమిటనుకున్నావ్? పరుపు... అదంటుకుంది. ఆత్మహత్య చేసుకునే పిల్ల హాయిగా పరుపుమీద పవళించి ఆత్మహత్య చేసుకుంటుందా? చెప్పు...

ఆ రమణమ్మ భర్త పరుపు మీద నుంచి తెచ్చి బయటపడేశాడట. కాల్చుకుని చనిపోయిన వాళ్లని నేమా

రెండు మూడుసార్లు చూశాను శారదా! అయితే ఇది, మాత్రం ఆత్మహత్య కాదమ్మా. ఇది ఖచ్చితంగా హత్యే!" అలా నాన్‌స్టాప్‌గా మా అత్తయ్య మాటాడుతోంటే ఆమె వంకే తదేకంగా చూస్తుండిపోయాను. ఆమె వాదనకి జోహారు చేయాలనిపించింది.

కట్నం పూర్తిగా తేలేదనే ఇన్నాళ్ళు సతాయించారు కదూ! ఇప్పుడు ఇంకో విషయం శారదా! సీతక్కకు సంతానం కలగలేదని, రెండో పెళ్ళి చేయాలనుకున్నారట ఆ రాముర్తికి. అందుకేనేమో అది బతికి ఉంటే రెండో పెళ్ళికి అడ్డంకి అని ఈ లోకంనుంచే తప్పించారు" అంది అత్తయ్య — అంతవరకూ ముందుకు వంగినదల్లా పడక్కుర్చీలోకి వాలింది.
నేను ఆలోచనల్లో పడిపోయాను.

* * *

రాత్రి తొమ్మిది గంటలైంది.

మావారు భోంచేశాక మంచంపై పడుకుని ఉంటే అత్తయ్య సీతక్క విషయం పూసగుచ్చినట్లు చెప్పేసింది.

"పోలీసులు వచ్చారామ్మా!" అన్నారు మా వారు.

"ఆదేం చోద్యమో చూడరా! ఆ పిల్ల ఒంటి గంటికి చనిపోయిందా? ఇంతవరకూ పోలీసుల జాడ లేదు. అసలు వాళ్ళకెవరికైనా కంప్లయింట్ చేశారో లేదో..." అంది అత్తయ్య.

"వాళ్ళింటి ఓనరు నేను చూస్తుండగానే పోలీసు కంప్లయింట్ ఇవ్వడానికి వెళ్ళాడత్తయ్యా" అన్నాను అత్తయ్య పక్కనే కూర్చుంటూ.

"ఆ పిల్ల తరఫువాళ్ళు... అదే వాళ్ళ అమ్మా నాన్నా వచ్చారా?" అన్నారాయన.

"అసలు ఇప్పుడా శవం దగ్గర ఎవరున్నారని అనుకున్నావ్ అంతా ఆ పిల్ల బంధువర్గమే — సాయంత్రం ఆరు గంటలకే కళ్యాణదుర్గం నుంచి సీతక్క తల్లితండ్రీ, బంధువులూ వచ్చేశారురా! అయితే వాళ్ళు రావడంతోనే సీతక్క మొగుడూ, అత్తా మామలు ఎక్కడికో ఉడాయించారు — ఏ మొహం పెట్టుకుని ఉంటారు?"

"నీకు మంచి పాయింటు దొరికిందోయ్" అన్నారు మా వారు నాకేసి చూస్తూ.

"బావుంది మీరనేది... కనిపించే ప్రతి సంఘటననీ కథ రాయడమేనా?"

"అవును రాస్తే ఏం? ఇలాంటి వాటినే రాయాలసలు! ఇలాంటి అన్యాయాన్ని పదిమందికి చెప్పాలి — అంటే కథగా రాయాలి... ట్రై చేయి" అన్నారాయన.

"అవును అబ్బాయి చెప్పింది నిజమే!" అంది అత్తయ్య.

"అది హత్యో ఆత్మహత్యో తెలీదు, ఎలా రాయడం. అది హత్య అయితే ఇన్వెస్టిగేషన్ కథ అవుతుంది. నాకలాంటివి రాయటం చేతకాదే. ఏదో సాంఘిక కథలు వరకే పరిమితం నేను."

"అది హత్యయినా కాకపోయినా నీకేమిటి సంబంధం? ఉన్నదున్నట్టు రాసెయ్... అత్త ఆరళ్ళు, మొగుడి సాధింపులు, కట్నాలు తెస్తున్న చావులు ఇలా ఒక క్రమంలో వస్తే అదే కథవుతుంది" అన్నారు సిగరెట్ వెలిగించుకుంటూ.

"అలా రాసి చూడు శారదా?" అంది అత్తయ్య.

"అనుకున్నంత సులభం కాదత్తయ్యా! పేపర్లో రోజూ ఎక్కడో ఓచోట కట్నం చావులు జరుగుతున్నట్టు చదివి పాఠకులకు సాధారణ విషయంలా అయిపోయింది. కథలూ అంతే... చాలా వచ్చాయి నీటిమీద."

"సమస్యలు పాతవేలేవోయ్! అయితే కథని కొత్త కోణంలో నడిపించు. అప్పుడే కదా కథకురాలిగా నీ గొప్పదనం బయటపడేది!" అన్నారు సీరియస్‌గా సిగరెట్ పొగని గాలిలోకి ఊదేసి.

అంతటితో మౌనంగా ఉండిపోయాను. అయితే నా మనసు మౌనంగా లేదు — దొంతరలు దొంతరలుగా వస్తోన్న ఆలోచనలతో మాట్లాడుతోంది.

అయితే కథకురాలిగా నాకో ప్రాబ్లమ్ ఉంది. ఏ కథకయినా ముగింపు దొరికితే కాని కథ రాయటం మొదలుపెట్టను. మరి అలాంటి నాకు ఈ సంఘటన కథగా ఎలా రాయగలను. ఏ ముగింపుతో కథ అల్లగలను. నిజానికి ఈ సంఘటనని కథగా రాయాలని ఇప్పుడిప్పుడే బలంగా అనిపిస్తోంది. అయితే మంచి ముగింపు లేనిదే కథ రాయలేని అసమర్థురాల్ని. అలా ఆలోచిస్తూ పక్కమీద పొరలుతూ వుంటే ఎప్పుడు నిద్ర పట్టేసిందో తెలీదు.

* * *



నన్ను

"ఇలా అడుగుతున్నానని ఏమీ అనుకోకు కమలా... మీ ఆయనకి ఒక కన్నే వుందేం...?" అడిగింది విమల.

"ఒక కన్నా... లేదే... రెండూ వున్నాయే" ఆశ్చర్యపోయింది కమల.

"మరి నేనెప్పుడు మీ ఆయన్ని చూసినా ఒక కన్ను కనిపిస్తోందే" చెప్పింది విమల.

—సిహెచ్. రవికిరణ్
(కొత్తగూడెం)

పొద్దున ఎనిమిది గంటలయింది.

వీధిలో బాగా కోలాహలంగా ఉంది. పోలీసులు వచ్చారు. కాని ఇంకా పోస్టుమార్టంకు శవాన్ని తీసుకుపోలేదు. రాత్రంతా ఎక్కడున్నారో ఏమో పొద్దున్నే దిగబడ్డారు సీతక్క మొగుడు, అత్తమామలు.

వంట విషయంలో మా వారు చండశాసనుడవడం వల్ల వాళ్ళ దగ్గర పెట్టుకుని వంట చేయడానికని వంటింట్లోకి వెళ్ళాను.

ఒక గంట తర్వాత వంట గదిలోకి మా అత్తయ్య ప్రవేశించింది.

"సీతక్క శవాన్ని పోస్టుమార్టంకి తీసుకెళ్ళారు శారదా!" అంది అక్కడే పీట మీద కూర్చుంటూ.

"ఎంతసేపయింది?"

"ఇప్పుడే... ఏం కన్నవాళ్ళోగాని ఆఖరికి పాపం! సీతక్కకి తల్లిదండ్రులే అన్యాయం చేశారు..."

ఏం అన్యాయం అత్తయ్యా" అయోమయంగా అడిగాను.

"సీతక్క మొగుడిమీదా, అత్తమామల మీదా, ఏ కేసు పెట్టకుండా ఇరవై వేలు నష్టపరిహారంగా ఇచ్చేటట్టు పెద్ద మనుషులతో రాజీ కుదిర్చారట" అని అత్తయ్య చెబుతోంటే షాక్ తిన్నట్టు అనిపించి — "అంటే ఒక నిండు ప్రాణం నష్టపోయినందుకు పరిహారం ఇరవై వేలా?" అన్నాను.

"మరేమనుకున్నావ్ శారదా! డబ్బు ఎంత పనైనా చేస్తుంది" అన్నారు మా వారు. ఎప్పుడొచ్చారో నాకిట్నుంచి వింటుని ఉన్నారు.

"అదేం కాదులేరా! పాపం... ఆ అమ్మాయి పుట్టింవాళ్ళు చాలా పేదవాళ్ళు. కేసుకేమి మహారాజాగా పెడతారు. ఆ తర్వాత కోర్టుల చుట్టూ, లాయర్ల చుట్టూ తిరగడానికి డబ్బుతోనేగా పని. ఎక్కణ్ణించి తెస్తారు. పైగా సీతక్కకి చెల్లెళ్ళు ఇద్దరు పెళ్ళికి ఎదిగి ఉన్నారుట."

"అలాగా" అన్నారు నిర్లిప్తంగా మా వారు.

ఈ దేశంలో ఒక ఆడది చావడానికి కారకులయిన వాళ్ళకి ఇంత సులభంగా తప్పించుకోడం సాధ్యమా? అందుకే ప్రతి రోజూ దేశంలో ఎక్కడో ఓచోట సీతక్కలు బలయిపోతున్నారు.

అదే క్షణంలోనే నా కథకి ఇంతకంటే మంచి ముగింపు ఏముంది అనిపించింది. *

